కథానిక:

కాందిశీకుడు

శ్రీ బులుసు వేంకటరమణయ్య

అవి కాశ్మీరంలో యుద్ధంజరిగే రోజులు!

పాకిస్తాను సేనలకూ, కాశ్మీర - యూనియన్ సేనలకూ పోరాటం చాలా తీవ్రంగా జరుగుతూ వుంది; రెండుపక్షాలకీ గెలుపులూ, వోటములూ విభిన్న ప్రాంతాల్లో కలుగుతూ వున్నాయి. కాని యూనియన్ సరిహద్దుప్రాంతాల్లో ప్రత్యేక పోలీసులూ, సిపాయిలూ తగిన బందోబస్తు చేసి, ఇతరులని లోపల ప్రవేశించనివ్వకుండా, అనుమానం వున్న మనుషులమీద వోక కన్ను వుంచే వుంటున్నారు.

సాయంకాలం; అది శీతకాలం కావడంచేత చలి ఎలాంటి మొండివాళ్ళ నయినా గజగజ లాడించి విడిచి పెడుతున్నది. ఇంట్లోంచి బయటికి వస్తే మంచువలె గడ్డకట్టి కూర్చోవలసినదే; అలాంటి సమయంలో ఒక జీపులో కొన్ని అవసరమైన వస్తువుల నుంచుకొని రెండవక్యాంపునుంచి మొదటిక్యాంపునకు సరదార్ భగవత్సింగూ, మిత్రుడు కురూపూ వెళ్తున్నారు. కురూప్ డ్రైవింగులో ఆరితేరినవాడు; వయస్సులో సింగుకంటే చాలా చిన్నవాడు; అతిధైర్య, సాహసాలు కలవాడు; అంచేతే అలాంటి సమయంలోకూడా మీద వచ్చిపడుతున్న మంచుగడ్డలని తప్పించుకుంటూ చాలా ఎత్తుగా వున్న ఘాటీరోడ్డుమీంచి తన రథాన్ని విడిచిపెడుతున్నాడు.

కారు రెండుమైళ్ళపైచిలుకు నడిచింది. తర్వాత మరి కదిలింది కాదు; కురూప్ ప్రయత్నం వ్యర్థమైంది; తీరా చూస్తే ప్లగ్గులు చెడిపోయి వున్నాయి; రేడియేటరు చాలా వేడి అయివుంది; మరమ్మత్తు చేస్తేనేగాని, ప్రయోజనం లేదు; రోడ్డుమీద వుండి పని చెయ్యడానికి సాధ్యం కాలేదు. ఏదేనా ఆశ్రయం - కుటీరం లాంటిదన్నా వుంటేనేగాని ఆ మంచులో నిలవడం అసాధ్యం!

వారా చుట్టుపక్కల చూశారు. నలభైగజాల దూరంలో ఒక చిన్న కుటీరం కనబడింది; 'బతుకుజీవుడా' అనుకుంటూ అవసరమైన పనిముట్లతో ఆ వేపు పరిగెత్తారు మిత్రులిద్దరూ.

ఆ కుటీరం చేరి చూసేసరికి, దాని తలుపు వేసి వుంది; దబదబా తలుపు కొట్టేసరికి, తలుపు మెల్లిగా వెనక్కి జరిగింది; అది వోక శూన్య కుటీరం! లోపల యెవ్వరూ లేరు. అప్పుడు వాళ్లు అర్థం చేసుకున్నారు అది మిలిటరీ క్యాంపువారి చిన్న కుటీరమంటూ. మట్టిపూసిన దాని శిథిల గోడలూ, జింకు పైకప్పూ అవీ, ఆ సంగతిని తెలుపుతూనే వున్నాయి.

భగవత్సింగు లోపల ప్రవేశించి జేబులోని అగ్గిపెట్టె తీసి వెలిగించాడు; అతనికి ఒకమూలని సగం కాలిన కొవ్వువత్తి కనబడింది. అతనికి చాలా సంతోషం అయింది; చీకటిలో ఎలా పని చెయ్యడం? అని అనుకుంటూ వుంటే దీపం దొరికిం దని చాలా సంతోషం కలిగింది. అది ఒక గంటదాకా వెలుగుతుంది; ఆలోగా పని పూర్తి కావచ్చును.

'ఈ రాత్రి మరి ప్రయాణం చెయ్యలేము; మంచుగడ్డలు గుట్టల్లాగ రోడ్డుకి అడ్డమవుతూ వుంటాయి; వాటిని తప్పించుకుని, యిరుకుగా వున్న ఘాటీరోడ్డులో ప్రయాణం చాలా దుస్తరం' అన్నాడు కురూప్.

'............'

'డ్రైవింగుకు భయపడి కాదు, నేను చెప్పడం! మీకంటె వయస్సులో చిన్నవాడ నవడం చేత, నేను చలినీ, మంచునీ సహించగలను. మీకే కష్టంగా వుంటుందని చెప్తున్నాను. వెచ్చగా యిక్కడ రాత్రిని గడిపి, పొద్దున్నే పోతే మంచిదేమో!'.

'మరో సంగతి; మనం ప్లగ్గులూ, అవీ బాగు చేసుకునే బయలుదేరతా మనుకోండి! మళ్లీ దారిలో రథం నిలిచిపోతే యేం చెయ్యడం! అక్కడ యిలాంటి కుటీరమన్నా వుంటుం దని యేం నిశ్చయం!'

'కురూప్! నువ్వన్నది బాగానే వుంది! మన వుద్యోగధర్మాన్ని మరచిపోకూడదు. మనకి యెన్ని చిక్కులు వచ్చినాసరే, వాటిని లక్ష్యం చెయ్యకూడదు. తుదకు ప్రాణాలు పోయినా సరే- మన గమ్యస్థానాల్లోనే కళేబరాలని పడవేసి మరీ ప్రాణం విడవాలి. నిజమైన భారతీయ సైనికుడి ధర్మం అదీ' అన్నాడు భగవత్సింగు.

అతను పనిముట్లను ముం దుంచుకొని కురూప్‌తో- 'గాలి జోరుగా వీస్తున్నది. నువ్వు తలుపు గడియపెట్టి, కిటికీమాత్రం తెరచివుంచి కొంచెం రెస్టు తీసుకో' నాకు మెకానిజం బాగా తెలుసు; నేను వీటిని బాగు చేస్తాను. నువ్వు రథం నడుపుదువుగాని' అని చెప్పి, తనపని ప్రారంభించాడు.

కురూప్ ఒక బీడీ ముట్టించి పచారుచేస్తూ కిటికీలోంచి ప్రకృతిని పరిశీలిస్తున్నాడు. అతని మనస్సులో మరేమీ ఆలోచనలు లేవు; నిర్విచారంగా, అతను బీడీమీద బీడీ ఆహుతి చేస్తున్నాడు.

ఇంతలో ఎవరో ఆ తలుపును దబదబా కొట్టారు; కొంచెంసేపటిదాకా ఎవరూ తలుపు తియ్యలేదు. 'చాలా చిక్కులో వున్నాను; కొంచెం ఆశ్రయం కావాలి' అని వినబడగా భగవత్సింగే లేచి వెళ్ళి తలుపు తీశాడు.

అప్పుడు ఒక పొడుగాటి మనిషి, కళ్ళఅద్దాలతో, ఒక హేటుతో ఉన్నిదుస్తులతో లోపల ప్రవేశించాడు. బొల్లి శరీరంనిండా వ్యాపించి వుండడంచేత, ముఖమూ, చేతులూ (అవే కనబడుతూ వుండడంచేత) చాలా తెల్లగా వున్నాయి.

'మీకు వచ్చిన ఆపద యేమిటి?' అనే అర్థంతో సింగు అతనివేపు చూశాడు.

తాను ఆశ్రయించినవారు మిలిటరీవాళ్ళవడం చేత - బతికి పోయా ననే అభిప్రాయంతో దీర్ఘంగా నిశ్వసిస్తూ అతను 'నేను చాలా దూరాన్నుంచి - పాకిస్థానువాళ్ల చేతుల్లోంచి తప్పించుకుని వస్తున్నాము. అదృష్టవశాత్తూ నా కొక కారు దొరికింది. మూడుమైళ్ళ దూరంలో దాన్ని విడిచిపెట్టవలసి వచ్చింది. చెడిపోవడం చేత.' అని అన్నాడు.

సింగు తనపని చేసుకుంటూనే వింటున్నాడు; కురూప్ నిదానించి చూస్తున్నాడా వ్యక్తిని, పరిశోధకుడిలాగ.

'ఈ దగ్గరగా వున్న కారు మీదే ననుకుంటాను. నేను యీ రాత్రే మొదటిక్యాంపు దాటి యూనియనులో వున్న గ్రామం చేరుకోవాలి. మీరు దయచేసి నన్ను అక్కడికి దిగబెట్టాలి. మీ మేలు మరచిపోను.' అన్నాడు.

'భయం లేదు; ఈ రాత్రి యిక్కడే గడిపి వుదయాన్నే మీరు వెళ్ళొచ్చు. ఇక్కడ శత్రువుల భయం ఏమీ లేదు. కళ్లు మూసుకుని మరీ వెళ్లవచ్చు.'

'అలా కాదు. ఈ రాత్రే నేను వెళ్లి తీరాలి. మా వాళ్లు నాకోసం బెంగ పెట్టుకుంటారు, దయయుంచి......'

అలా అంటూ వుండగానే డబడబ మనే పెద్ద శబ్దం అయింది. అ దేమిటో అంటూ గబగబా ఆ కొత్తవ్యక్తి కిటికీదగ్గిరికి పోయి చూశాడు! వాన పడుతున్నది.

'అమ్మో! పెద్దవాన పడుతున్నాది' అంటూ అతను డబుల్ న్యూమోనియా వచ్చినవానివలె చాలా భయపడుతూ వచ్చి సింగువద్ద ముణుచుకుని కూర్చున్నాడు.

ఈ వ్యక్తిని పరిశీలిస్తున్న కురూప్ ఒక చిన్న నవ్వు నవ్వుకున్నాడు.

'ఫరవాలేదు; ప్లగ్గులూ అవీ బాగు చేశాను; వాన ఉద్ధృతం తగ్గేక మనం ప్రయాణం చెయ్యొచ్చు; అంతగా తగ్గకపోతే యీ రాత్రి యిక్కడే కాలం గడుపుదాం; పొద్దున్నే పోవచ్చు' అన్నాడు సింగు.

'ఈ వానను చూస్తే నాకూ అదే మంచిదని యిప్పుడు తోస్తున్నాది.' అన్నా డా వ్యక్తి.

'ఈ రాత్రి యెలాగన్నా వూరు వెళ్లి తీరాలన్నారుగదా! మరి అవసరం అట్టేలేనట్టే గదా!' అన్నాడు కురూప్.

'వెళ్ళవలసిందే! వర్షమయితే యెలా వెళ్ళడం' అంటూ ఆ వ్యక్తి కొంచెం గొణిగాడు.

మరో పావుగంట గడిచింది.

వర్షం వెలియలేదు; కాని ఉద్ధృతం కొంత తగ్గింది.

సింగు సామాను మూటకట్టాడు. కురూప్ మోటురు దగ్గిరికి దారి తీశాడు.

వాళ్ళిద్దరూ కాందిశీకుడ నంటూ చెప్పిన ఆ వ్యక్తివైపు చూశారు.

'ఇంతవర్షంలో రాలేను బాబూ, ఈ రాత్రి యెలాగో యీ గుడిసెలోనే గడుపుతాను' అని అత నన్నాడు

వారు కారు దగ్గరికి వెళ్ళి, ప్లగ్గులనీ వాటినీ సరి చేశారు; బండి స్టార్టవడానికి సిద్ధంగా వుంది.

ఇంతలో ఒక టార్చిలైటువెలుగు వారిమీద పడింది. ఆ లైటు వేసినవాడు పత్తేదారు కరంసింగు.

అతన్ని పోల్చి భగవత్సింగు నవ్వేశాడు.

'హలో. భాయీసాబ్! మీ కీ చుట్టుపక్కల యవరన్నా ఒక మనిషి కనబడ్డాడా! ఒక ఆసామీ శత్రుపక్షంవాడు మన ఆచూకీ తియ్యడానికి రెండురోజులనుంచీ అనేక వేషాలతో తిరుగుతున్నాడు' అన్నాడు పత్తేదారు సింగు.

'పొడుగ్గా నల్లగా వుంటాడు; వూలుదుస్తులు ధరిస్తాడు. బొచ్చుటోపీ;' అందుకున్నాడు అతని పక్కనే నిలిచి వున్న తాబేదారు ధరంవీర్.

'కళ్లజోడు ధరించి వున్నాడా?' అన్నాడు కురూప్.

'లేదు;' అన్నాడు ధరంవీర్.

కురూప్ కుటీరంవైపు చెయ్యి చూపించి 'అందులో పరిశోధించండి' అన్నాడు.

పత్తేదారు తన యిద్దరుతాబేదార్లతోనూ, ఆ గుడిసెవైపు వెళ్లాడు.

భగవత్సింగుకు ఇదేమీ అర్థం కావటం లేదు.

'ఏమి, కురూప్! వాళ్లని మతాబా కాల్పించావే! పాపం! ఆ కాందిశీకుణ్ణి కొంపతీసి వీరు పట్టుకోరు గద! పాపం అమాయకుడు! వర్షమంటేనే బెదిరిపోయే పిరికివాడు!' అన్నాడు సింగు.

'పాపం! వాడి అమాయకత్వాన్ని మీరే మెచ్చుకోవాలి!'

'అయితే పత్తేదారుకి కావలసిన వ్యక్తి వాడేనంటావా?'

'సందేహం లేకుండా!' మీరు గమనించలేదు; కాని, నేను కనిపెడుతూనే వున్నాను వాడి వాలకం? అదంతా వేషం! మేకప్! నల్లదేహానికి తెల్లరంగు పూశాడు; పోలిక తెలియకుండా వుండేటందుకు హేటూ, కళ్లజోడూ పెట్టాడు; మొదట- అర్జంటుగా పోవాలనీకూడా వర్షం రావడంచేత- మేకప్ కరిగిపోయి రహస్యం బయటపడుతుం దని గుడిసెలోనే కూర్చున్నాడు అంచేతే- వర్షమంటే అంత భయం!

'ఆరి వీడితస్సాగొయ్యా! అయితే- అంత ధైర్యంగా ఎలా తలుపులు తట్టే డంటావు!'

'వాడు గుడిసెవెనకాతల దాగుకున్నాడు, మనం వస్తూవుండడం జూసి; మనం తలుపులు వేసుకున్నాక, ద్వారందగ్గిరకి వచ్చి మనమాటలు విని, ధైర్యం తెచ్చుకున్నాడు; నేను కిటికీలోంచి చూస్తూనే వున్నానుగా! రోడ్డుమీద నుంచి వాడు రానేలేదే!'

జీపు స్టార్టయింది.

భగవత్సింగు వెనక్కి చూశాడు; టార్చిలైటు సాయంతో పత్తేదారూ, అతని తాబేదార్లూ ఆ నూతనవ్యక్తిని కట్టి యీడ్చుకురావడం చూచాయగా అతనికి కనబడింది!

కథానిక:

"రిక్షావాలా"

శ్రీ భాస్కరభట్ల కృష్ణారావు

"పిల్లా! నేను పట్నం పోతా!"

"నువ్వు పట్నంపోతే నా గతి ఏమవుతుంది మామా?"

"మనవూరు పాడుబడింది. కలిగినవాళ్లల్లా పట్నానికి ఎగబాకారు. ఏదో సంసారం గడవాలంటే నేను పట్నం పోక తప్పదు-"

"అయితే నీతో నేనుగూడా వస్తా మామా."

"నేను పోగానే పట్నంలో కొలువు దొరుకుతుందో లేదో—నువ్వు యిప్పుడే నాతో వస్తే యిద్దరం అష్టకష్టాలు పడవలసి వస్తుంది. అందుకోసం, నేను పోయి కొలువు చూసుకున్నతరువాత నేనే వచ్చి నిన్ను పట్నం తీసుకుపోతా."

"లేదు మామా నన్ను వదలి పెట్టి పోకు— నువ్వు లేకపోతే నేను బతకలేను— ఈ కసాయి వాళ్లు నన్ను బతకనివ్వరు-"

అవి మతపాక్షికత్వం ప్రబలంగా వ్యాపించి ఉన్న రోజులు. అప్పట్లో దోపిడులు, గృహదహనాలు, సంస్థానం అంతటా చెలరేగుతూ ఉండినవి. కాని రామచంద్రపురం ఒక కుగ్రామం. సంస్థానానికి ఒక మారుమూలలో ఉంటుంది. అందువల్ల అక్కడికి మతపాక్షికత్వజంఝామారుతం ఇంకా వీచలేదు. ఇప్పుడో అప్పుడో గ్రామం, మతావేశపరులయిన గుండగులకు బలి అవుతుం దని ప్రజలు భయపడుతూ ఉండినారు- ఫలాని పల్లెటూరును దోచుకున్నా రనీ, ఫలాని గ్రామానికి నిప్పంటించార నే వార్తలు రోజూ ఆ గ్రామానికి కొల్లలుగా చేరుతున్నాయి. రైతులకు పంటలమీద శ్రద్ధ తగ్గింది. తదితర అలగాజనానికి గ్రామవృత్తులపైన నైరాశ్యం కలిగింది. ధనవంతులు గ్రామాన్ని వీడి పరదేశ పంచలను పడుతున్నారు. బీదసాదలకు, గ్రామాన్ని వీడి వెళ్లడంమాట అటుంచి, కరువుకాటకాలవల్ల, అల్లరిమూకల ఘాతుకకృత్యాలవల్ల బ్రతుకు నీడ్వడమే దుర్భరమైపోయింది. పాపం బీదవారు ధనాభావంతో పరప్రాంతాలకు వెళ్లలేక గుడ్డిలో మెల్ల అని బ్రతికి బట్టకడితే చాలు ననే భావంతో పట్నవాసాలకు చేరుకుంటున్నారు. పాపం ఎంకడు పరిస్థితులన్నీ గమనించి, పట్నానికి వెళ్లి జీవనోపాధిని చూసుకోవడమే శ్రేయస్కర మని భావించాడు. భార్యాభర్తలు యిద్దరూ వెడితే, కూలీనాలీ దొరకక, నానా అవస్థలపాలు కావలసి వస్తుందేమో ననే భయంకొద్దీ, భార్యను అప్పటి మట్టుకు ఊళ్లోనే వదలి వెళ్లడం మంచి దని నిశ్చయించుకొని ఆమెను ఒప్పించడానికి పూనుకున్నాడు.

"పిల్లా! మనం ఇక ఈఊళ్లో ఉండలేము. మనకు తెలిసినవాళ్లల్లా పట్నవాసాలకు చేరుకున్నారు. పట్నానికి వెళ్లిన, వాళ్లను వెతికి, కూలో, నాలో సంపాదించి, ఒక నెలరోజుల తరువాత నేనే స్వయంగా వచ్చి నిన్ను తీసుకొని వెడుతా! అంతవరకు నువ్వు ఏదో విధంగా ఓపికపట్టి ఈఊళ్లోనే ఉండడం మంచిది. లేకపోతే పట్నంలో యిద్దరమూ పొట్టగడవక నానా కష్టాలూ పడవలసి వస్తుంది."

"మామా! మనకు కష్టాలు ఏమైనా కొదవా! 'కో'అంటే కోటికష్టాలు వచ్చి పడుతాయి. కష్టాలను ఈడ్వడం తప్పదు- అందువల్ల, యిద్దరం ఒకే చోట ఉండి వాటిని ఎదుర్కోవడం మంచి దని నాకు తోస్తున్నది."

"అది నిజమే— కాని మనదగ్గర ప్రస్తుతం డబ్బేమీ లేదు. వెళ్లీ వెళ్లడంతోనే యితరుల పైన పట్నంలో ఆధారపడవలసి వస్తుంది. మన మెన్నడూ దేహీ అని ఇతరులను యాచించి యెరగము. మగవాడిని నేను ఎన్నికష్టాలైనా సద్దుకుంటాను. కాని నువ్వు ఈ అవస్థలన్నీ పడలేవు. అందువల్ల నువ్వు ఇక్కడే వుండిపోవడం మంచిది."

"మామా! అయితే నువ్వు ఎన్నిరోజులకు వస్తావు?"

"పిల్లా నేను మాత్రం నిన్ను వదిలి ఎక్కువ రోజులు వుండగలనా నాలుగురాళ్లు సంపాదించడంతోనే ఇక్కడికి వచ్చి వాలనూ?"

ఎంకి కాపురానికి వచ్చి, తీరా ఒక సంవత్సరమైనా కాలేదు. అంతలోకే, ఈ అల్లరు ఉప్పెనకుమల్లె వచ్చిపడ్డాయి. చల్లకదలకుండా గడుస్తున్న సంసారం, ఒక్కమాటే తలక్రిందు లైంది. బ్రతుకు నీడ్వడమే కష్టంగా పరిణమించింది. భర్త వెళ్లకతప్ప దని తెలియడంతోనే, అఘాటుపాటున ఎంకి కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. ఎంకడి ఎడబాటు, ఎందుకో దుర్భరంగా తోచింది. పెద్ద పెట్టున గొల్లుమంటూ ఎంకి, ఎంకడి కంఠంచుట్టిరిన

(25-వ పేజీ చూడుడు)

కులాసా కబుర్లు:

"రాష్ట్రనిర్మాణ లిమిటెడ్ కంపెనీ"

[జి. యన్. సూరి]

రష్యా ప్రభావానికి ఆహుతి కాకుండా సాధ్యమైనంతవరకు యూరపు రాజ్యాలను బందోబస్తు చేయటానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అట్లాంటిక్ ఒడంబడికలు, పశ్చిమ ఐరోపా కూటములు ఎన్నో క్రమంగా అవతరిస్తున్నవి. వీటి అన్నింటికి పెట్టుబడి అమెరికాది; హంసుదారులు బ్రిటిష్ కన్సర్వేటివ్ పార్టీ వారు. ఉభయులదీ వ్యాపారదృష్టే. అడిగిన దేశానికల్లా అప్పులు పెడితే అందుబాటులో ఉండి తీరక పోతారా అని వారి ధైర్యం.

ఈ విధానాన్ని సరియైన కట్టుదిట్టాలతో అమలుపరిచేందుకు ఒక లిమిటెడ్ కంపెనీని స్థాపించటానికి నిర్ణయించినట్లు ఈమధ్య ఒక ప్రకటన జరిగింది. చర్చిల్ వగైరాలు ఈ కంపెనీకి డైరెక్టర్లుగా ఉంటారుట. రిజిష్టర్డు ఆఫీసు లండన్‌లో ఉంటుందిట. అన్ని దేశాలలోను బ్రాంచి ఆఫీసులను నెలకొల్పుతారుట. పత్రికాముఖంగాను, రేడియోలద్వారాను, సమావేశాలవల్లను గుక్క తిప్పుకోకుండా ప్రచారం చేస్తారుట. ఎఱ్ఱరంగు కంటికి కనపడకుండా కంచెలు పట్టుకుని వెళ్ళవేస్తారుట.

ఈ విషయంలో ఇంగ్లీషువాళ్లు మంచి అనుభవజ్ఞులు. ఈస్టిండియా కంపెనీ ద్వారా సామ్రాజ్యాన్ని సంపాదించగలిగిన ఆసాధ్యులు. ఈ కొత్త కంపెనీ ద్వారా రక్తవర్ణానికి విరుగుడు తేలేక పోతారని మనం సందేహించ నవసరం లేదు. ఇంపీరియల్ కెమికల్ వర్క్సు వాళ్లు కావలసినంత బ్లీచింగ్ పౌడరును అందించగలరు. రష్యా అడ్డకం ఎంతవరకు తట్టుకుంటుందో చూడతగిన విషయం.

ఈ కొత్తకంపెనీ కమీషనుగురించి ఇంతగా వివరించటానికి కారణం లేక పోలేదు. దీని భోగట్టా యావత్తూ సేకరించి, బాగా పరిశోధించవలసిన బాధ్యత మననాయకులమీద ఉన్నది. ముఖ్యంగా ఆంధ్రులు విధిగా గమనించాలి. ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించటానికి ఇంతకంటె సులువైన మార్గం మరొకటి లేదు. అఖిలాంధ్ర పరిషత్ సమావేశాలవల్లనూ, అగ్రనాయకుల డెప్యుటేషన్లవల్లనూ, నివేదికలవల్లనూ, ప్రాయోపవేశాలవల్లనూ ఒక్కనాటికీ ఆంధ్ర రాష్ట్రాన్ని సంపాదించలేము. అంతూ పొంతూ లేని బాధ్యతలను నెత్తిమీద పెట్టుకుంటే ఏపనీ సానుకూలం గాదు. అందువల్ల మితమైన బాధ్యతే ప్రధానంగా ఉండే లిమిటెడ్ కంపెనీ అన్ని విధాలా తగిఉంటుంది. చర్చిల్ అండ్ కంపెనీ కంటె ఆదర్శప్రాయమైనది మనకు మరొకటి ఉండదు.

ఆంధ్రనాయకులు వెంటనే ఇండియన్ కంపెనీల చట్టం క్రింద ఒక సంస్థను స్థాపించాలి. కావలసిన మెమొరాండమును, ఆర్టికిల్సును పేటిలాయర్ల చేత తయారు చేయించాలి. కావలసి ఉంటే కాంగ్రెసు తరఫున వాదించటానికి పరుగెత్తుకునివచ్చి వనకకు వెళ్లిన రాబర్ట్సు దొరవారి సలహాగూడ పొందవచ్చును. ఈ కంపెనీని "ఆంధ్రరాష్ట్ర నిర్మాణపు కంపెనీ లిమిటెడ్" అని పిలవవచ్చును. ప్రధాన కార్యాలయం కృష్ణానదికి ఉత్తరంగా చెన్నపట్నంలోనే ఏర్పరచాలి. దీనిలో వాటాదార్లుగా చేరటానికి డబ్బు పెట్టుబడి అవసరం ఉండదు. రాష్ట్రం కోసం కొద్దోగొప్పో పాటుపడగల ప్రతి తెలుగు వ్యక్తీ వాటాదారు కావచ్చును. అయితే మద్రాసుపైద హక్కు వదులుకోవాలని అనేవాళ్ళకు మాత్రం షేర్లు మంజూరు చేయకూడదు.

తెలుగు జనాభా ఉన్న ప్రాంతాల నన్నిటినీ మద్రాసుతో సహా బ్రహ్మాండమైన రాష్ట్రంగా నిర్మాణం చెయ్యటం ఈ కంపెనీ యొక్క ప్రధాన ఆశయమని మెమొరాండం ఆఫ్ అసోసియేషన్‌లో నిక్కచ్చిగా ఉదహరించాలి. సదరు రాష్ట్రాన్ని చట్టబద్ధమైన వివిధ మార్గాలద్వారా సాధించటమే ముఖ్య కర్తవ్యం అని తేటతెల్లం చేయాలి. మొదటి సంవత్సరంలోమాత్రం డైరెక్టర్లకు ఎన్నిక ఉండకూడదు. శాంతిరామమూర్తిగారు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు అధ్యక్షుడుగా ఉంటే బాగుంటుంది. అనంతశయనం అయ్యంగారు, ఆచార్య రంగా, మహర్షి సాంబమూర్తిగారు ప్రకాశం పంతులు, కాశీశ్వరరావుగారు, రామకృష్ణ రాజుగారు మొదలైన అష్టదిగ్గజాలు డైరెక్టర్లుగా ఉండాలి. కావలసిన ప్రచురణకోసం ఒకరిద్దరు తెలుగు పత్రికాధిపతులను కో ఆప్ట్ చేసుకో వచ్చు. శిసలైన వ్యాపారసరళిలో కార్యక్రమం నడిపించాలి. అవసరం అని తోస్తే గుంటూరు నరసింహారావు అండ్ మద్దిసుదర్శనంగారిలాంటి వర్తకప్రముఖులను సంప్రదిస్తూ ఉండవచ్చు.

అయితే ఒక్క విషయం మాత్రం కట్టుదిట్టం చేసుకోవాలి. తెలుగుదేశంలో ఏ లిమిటెడ్ కంపెనీ పెట్టినా మర్నాటినుంచీ లిక్విడేషను సన్నాహాలు తప్పనిసరిగా చేస్తూ ఉంటారు. అందువల్ల రాష్ట్రం సిద్ధించేవరకూ కంపెనీ రద్దు కాకుండా తగిన బందోబస్తులను ముందుగానే ఏర్పరచుకోవాలి. లేకపోతే మొదటికే మోసం వస్తుంది. ఆపైన సదరు రాష్ట్రం సిద్ధించేవరకూ డివిడెండ్లమాట ఎత్తనివ్వకూడదు. కాబోయే మంత్రులెవరా అని, పర్మిట్లు ఎవరికి ఇవ్వటమా అని అంతవరకూ ఆలోచించకూడదు.

"ఆంధ్రరాష్ట్ర నిర్మాణపు కంపెనీ లిమిటెడ్" అవతరించగానే దీనికి పోటీ కంపెనీ మరొకటి బయలుదేర తీయటానికి ప్రయత్నాలు జరిగి తీరుతాయి. మద్రాసుమీద హక్కు వదులుకోదలచినవాళ్లు ఇందులో షేర్‌హోల్డర్లుగా చేరుతారు. కార్యస్థానం బెజవాడలోనో గుంటూరులోనో ఏర్పరచవచ్చు. డాక్టరు పట్టాభిగారిని కంపెనీఅధ్యక్షుడుగా ఉండమని కోరటం, కళా వెంకట్రావుగారిని, గోపాలరెడ్డిగారిని, పున్నయ్యశాస్త్రిగారిని మొదలైనవారిని ప్రథమ డైరెక్టర్లుగా ఉండమని బ్రతిమాలటం జరిగి తీరుతుంది. ఈ కంపెనీ అంటూ స్థాపితమైతే శ్రీమాన్ రాజగోపాలచార్యులవారు ప్రారంభమహోత్సవంనాడు శుభాశీస్సులను పంపుతారని ఆశించవచ్చు. ఒకవేళ మద్రాసు ప్రభుత్వంవారు కొన్ని షేర్లను కొనినా కొనవచ్చు.

కొద్దీ గొప్పా తేడాలు ఉన్నప్పటికీ ఒకటికి రెండుకంపెనీలు బయలుదేరితే ప్రయోజనం ఉండకపోదు. ఏ పిల్లి అయితే మనకేం ఎలుకను పట్టితే చాలు. అదీ గాక పోటీ సంస్థ అంటూ లేకపోతే మనదేశంలోని రాష్ట్రీయప్రభుత్వాలలో మాదిరి ముఠాపోట్లాటలు ప్రాప్తించవచ్చు. అందువల్ల ఒక విధంగా రెండు కంపెనీలూ అవసరమే అని చెప్పవచ్చు.

కాన్ఫరెన్సులవల్ల సాధించలేని దానిని కంపెనీలవల్ల సాధించవచ్చునని చర్చిల్ అంతటివాడు మనకు మార్గం చూపుతున్నప్పుడు మనం అనుకరించకపోతే ముందు యుగంబుల జనులు తలలూపరుసరిగదా వంచిన తల ఎత్తరు. మన నాయకులు ఈ విషయంలో ఎంతవరకు శ్రద్ధ తీసుకుంటారో గమనించదగిన విషయం.

రిక్షావాలా

(11-వ పేజీ తరువాయి)

శరీరాన్ని చుట్టివేసింది. భార్య దుఃఖాన్ని చూచి, ఎంకడికికూడా దుఃఖం పొంగి పొరలి, గట్లు దాటి ప్రవహించడం మొదలుపెట్టింది. కాని కర్కశజీవితం ఏ దుఃఖాన్నీ చూచి జాలి పడదు. నియమబద్ధజీవితం దాక్షిణ్యం వహించదు. కష్టాలకోసమే బీదరిక ఈ దారుణ ప్రపంచంలో పుట్టింది. అది ఆ కష్టాలను అనుభవించక తప్పదు.

* * *

మరునాటి ఉదయం ఎంకడు తెల్లవారు ఝామునే హైదరాబాద్‌కు బయల్దేరాడు. ఎంకి ఎంకడు వెళ్లినదారికి కళ్లు అప్పగించి, తన దుర్దశకు జలజల కన్నీళ్లు కార్చడం మొదలు పెట్టింది. ఎంకడు మరునాడు హైదరాబాద్ చేరుకొని తన ఊరివాళ్లకోసం, ఆ రోజుఅంతా నగరం గాలించాడు. కాని వాళ్ల ఆచూకీ ఎక్కడా దొరక లేదు- చేతిలో డబ్బు లేదు. కడుపు దహించుకపోతున్నది- బిచ్చమెత్తడం అతనికి ఏమాత్రం మనస్కరించలేదు. దారిన వెడుతూన్న ఒక రిక్షావాణ్ణి పిలచి, వాడు ఊరివాడుగా ఉండడం గమనించి, అతనిపై ప్రశ్నల పరంపరను కురిపించాడు.

"మనది ఏ వూరు?"

"బాటసింగారం"

"ఎన్ని రోజులనించి ఈ పని చేస్తున్నావు?"

"ఆరు నెల్లనించి"

"రోజుకు ఎంత గిట్టుతుంది"

"చెప్పడం కష్టం. దొరకిననాడు బాగానే దొరుకుతుంది. దొరకనినాడు ఏమీ లేదు"

"ఈ బండి నీదేనా"?

"కాదు, దీన్ని బండి అనరు, రిక్షా అంటారు"

"నీది కాకపోతే నీదగ్గర ఎందుకున్నది?"

"కిరాయకు తీసుకొచ్చినా"

"కిరాయి ఎంత?"

"రోజుకు రెండు"

"అమ్మా! రోజుకు రెండు రూపాయిలే?"

"మనది ఏ ఊరూ?"

"రామచంద్రపురం"

"పట్నం ఎప్పుడు వచ్చినావు?"

"నిన్ననే"

"బతుకు దెరువుకోసమే నా?"

"అవును."

"ఎక్కడైనా చూసుకున్నావా?"

"లేదు"

"ఏమి చేద్దా మనుకుంటున్నావు?"

"ఈ బండి తొక్కడం నాకు నేర్పుతావా?"

"బండి కాదు—రిక్షా—నేర్చుకుంటే తప్పకుండా నేర్పుతా?"

"కింద పడుతానా?"

"లేదు- తొక్కి చూడు ఏమీ పడవు?"

ఎంకడికి ఆకలివల్ల బండి ఎక్కడంతోనే కళ్లు గిర్రున తిరిగాయి. తూలిపోతూ ఉండడం గమనించి, రాముడు. నువ్వు ఈరోజు ఏమీ తిన లేదా అని అడిగాడు. ఎంకడు 'డబ్బు లేదు' అని జవాబు చెప్పాడు. రాముడు జాలి చెంది ఎంకడిని హోటలుకు తీసుకొని వెళ్లాడు. కడుపు నిండా బజ్జీలు, పకోడీలు పెట్టించి, బలవంతంగా ఎంకడితో, టీ తాగించాడు. ఎంకడు మరునాటినుంచీ రిక్షా వృత్తి అవలంబించాడు. డబ్బు ఎక్కువ గడించాలన్న ఆశతో రాత్రింబగళ్లూ రిక్షా నడపడం మొదలు పెట్టాడు. రాత్రికి ఏ 2, 3, గంటలకో అదే రిక్షాలో పడుకునేవాడు. మళ్లీ తెల్లవారు ఝామునే కిరాయకు బయల్దేరేవాడు, రోజూ, అన్నం ఉండేది కాదు. కనపడిన హోటల్‌లోకి దూరి బజ్జీలు, పకోడీలు, పూరీలతో కాలం గడిపేవాడు. 15 రోజులు అయ్యేసరికల్లా ఎంకడి, కండలుతీరిన శరీరం దిగజారిపోయింది. మనిషి సన్నగా గుర్తుపట్టడానికి కూడా వీలు లేకుండా మారిపోయినాడు. అప్పుడప్పుడూ అతనికి ఎంకి జ్ఞాపక మొచ్చేది. ఎంకి జ్ఞాపకం వచ్చిన నాడల్లా, అతను ద్విగుణీకృతోత్సాహంతో పని చేసేవాడు.

ఒకనాడు అతనికి గుండెలో ఏదో సన్నని నొప్పి లేచింది. అతను మొదట ఆ నొప్పిని ఏమాత్రం లక్ష్యం చేయలేదు. నొప్పి క్రమంగా వృద్ధి చెంది దగ్గులోకి పరిణమించింది. దగ్గు రోజుకు రోజు ఎక్కువ కావడం మొదలు పెట్టింది. అయినా అతను ఎంకిని త్వరగా పట్నం తెచ్చుకోవాలనే ఉద్దేశంతో రిక్షా నడపడం మానలేదు. దగ్గు వాంతులకు దారితీసింది- నెమ్మదిగా జ్వరం రావడం మొదలు పెట్టింది- ఎక్కడా నిలువనీడ లేక రాత్రిళ్లు ఎంకడు ఆ రిక్షాలోనే పడి మూల్గేవాడు ఉదయం మళ్లీ ఏదో కొద్దిగా తేరుకొని, టీ, కాఫీలతో ఉపశాంతి పొంది మళ్లీ రిక్షా నడిపేవాడు. ఈవిధంగా కొన్ని రోజులు గడిచాయి. వాంతులు క్రమంగా హెచ్చాయి- నోటినుండా దగ్గితే రక్తం పడడం మొదలుపెట్టింది. ఒకనాడు రాముడు ఈ స్థితి చూచి ఎంకడిని తన యింటికి తీసుకొని వెళ్లాడు. ఆనాడు ఎంకడికి అన్నం సహించలేదు. రక్తం పడడం మరీ ఎక్కువైంది. రాత్రంతా ఎంకీ ఎంకీ అని కలవరించాడు. కాని ఆరాత్రి ఎంకడికి, ఎంకి కలలోనైనా కనపడలేదు ఉదయం అయ్యేసరికి పక్కన రూపాయిల మూటతో ఎంకడు కాలధర్మం చెందాడు. నవీననాగరికత, పట్నవాసం బ్రతుకు ఇంకొక అమాయకుడిని పొట్ట బెట్టుకున్నది. పాపం, ఎంకికి ఈ సంగతేమీ తెలియదు. ఎంకడి రాకకోసమై రోజూ దారులు కాస్తున్నది.

కర్కశ ప్రపంచం, ఏమీ తెలియనట్టు వంగనాచివలె మామూలుగా తిరిగి వ్యవహరించడం మొదలు పెట్టింది.

---

(౨) మ గ రి స రి స ని ధ మ ధ స స మ గ మ | గ మా గ మ ధ గ మ ధ ని సా, ని ధ మ మ గ రి గ
మ న సు నీ య ధీ న ము మా ట లు నీ వా డె డి వే
మ గ మ గ మ ధా మ గ మ ధ మ గ రీ స ని | స రి ని స మ గ మా , , , ,
త ను వు నీ పు ట్టిం చి న ధ న మి ది
మ స నీ నీ నీ ధ ని ధ మ గ మ ధా ధ | , గ మ ని ధ ని సా ని స రి స
ము ను నీ పం పు న ని న్ని మో చు కొ న్న వా డ నిం తే
ని ధ గ రి రీ స ని ధ ధ మ ధ | సా ని ధ మా ని ధ మ గ రి ని
వె ను క న న్నే నే రా లు వే య క ర క్షిం చ వే (నమో)

ఇట్లే క్రింది చరణములు :

(౧) భోగములెల్లా నీవి – బుద్ధులు నీ విచ్చినవి;
యీగతి నా బతుకు నీ - కిర వైనది;
చేగ దేర నీవు నన్ను - జేసిన మానిసినింతే,
సోగల నా యజ్ఞానము - చూడక రక్షించవే (నమో)

(3) వెలి నీవే లో నివే; - వేడుకలెల్లా నీవే;
కలకాలమును నీ - కరుణే నాకు;
ఇల శ్రీ వేంకటేశ నీ - వేలుకొన్న బంటనింతే;
నెలవు దప్పించక - నీవే రక్షించవే. (నమో)

టీక : ఇరవైనది=వసించు చోటైనది; చేగదేర=సారము తేలునట్లు; సోగల=పొడువుగా - ఎక్కువగా; నెలవు=స్థానము-ముక్తి.